కర్నూలు సీమకిరణం నంద్యాల
తెలుగు దినపత్రిక
www.seemakiranam.com, www.seemakiranamnews.com



# శ్రీరంగాపురంలో డ్రైనేజీ బ్లాక్.. పొలాల్లోకి మురుగు నీరు

ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోని అధికారులు..

ఆందోళనకు సిద్ధమవుతున్న గ్రామస్తులు

**వెల్దుర్తి, ఆగస్టు 30 (సీమకిరణం న్యూస్):** కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం శ్రీరంగాపురం గ్రామంలోని వడ్డిగేరి ఎస్సీ కాలనీలో డ్రైనేజీ సమస్య తీవ్రరూపం దాల్చింది. డ్రైనేజీ కాల్వలు పూర్తిగా బ్లాక్ కావడంతో మురుగు నీరు కాల్వల్లో ప్రవహించకుండా పొలాల వెంబడి పారుతోంది. దీంతో రైతులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగు నీరు పొలాల్లోకి చేరుతుండటంతో పశు గ్రాసం కలుషితమవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువులకు మేత అందించడంలో కూడా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. మరోవైపు నిల్వగా ఉన్న మురుగు నీటి కారణంగా దుర్వాసన వెదజల్లుతూ పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. దీంతో ప్రజలు అనారోగ్య భయాందోళనలకు గురవుతున్నారు.

**అధికారులకు మొరపెట్టుకున్నా.. స్పందన కరువు**

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని సచివాలయంలోని పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌కు పలుమార్లు విన్నవించినప్పటికీ



సమస్య పరిష్కారం కాలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులు అందుబాటులో లేరని, తాను ఏమీ చేయలేనని అధికారులు చెబుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపకపోవడంపై రైతులు, ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాల్వలను వెంటనే శుభ్రం చేసి, మురుగు నీరు పొలాల్లోకి వెళ్లకుండా శాశ్వత పరిష్కారం చూపాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**ఇకనైనా స్పందించాలి**




ప్రజల ఆరోగ్యం, రైతుల పంటలు, పశుగ్రాసానికి సంబంధించిన సమస్య కావడంతో అధికారులు ఇకనైనా నిర్లక్ష్యం వీడి తక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. డ్రైనేజీ కాల్వలను శుభ్రం చేయడంతో పాటు భవిష్యత్తులో సమస్య పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని ప్రజలు కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళనకు దిగాల్సి వస్తుందని గ్రామ ప్రజలు హెచ్చరిస్తున్నారు. "సమస్యను ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు" అంటూ వడ్డిగేరి ఎస్సీ కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# కర్నూలులో పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ విక్రాంత్ పాటిల్

నీట్ – పిజి పరీక్షా కేంద్రాలపై ఎస్పీ విక్రాంత్ పాటిల్ నిఘా

భద్రత, ట్రాఫిక్, అభ్యర్థుల ప్రవేశంపై స్వయంగా పరిశీలన

నీట్ – పిజి పరీక్షలపై పోలీస్ యంత్రాంగం ఫుల్ అలర్ట్




**కర్నూలు క్రైమ్, ఆగస్టు 30, (సీమకిరణం న్యూస్):** నీట్ – పిజి పరీక్షల నేపథ్యంలో కర్నూలు నగరంలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదివారం





స్వయంగా పరిశీలించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసు యంత్రాంగం చేపట్టిన భద్రతా ఏర్పాట్లను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కర్నూలులోని డా. కె.వి. సుబ్బారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, జి. పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన నీట్ – పిజి



పరీక్షా కేంద్రాలను ఎస్పీ సందర్శించారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, అభ్యర్థుల ప్రవేశ ప్రక్రియ తదితర అంశాలను పరిశీలించిన ఎస్పీ.. విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. పరీక్ష పూర్తయ్యే వరకు సిబ్బంది పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలని, కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రత కొనసాగించాలని ఆదేశించారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని సూచించారు. నీట్ – పిజి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. ఎస్పీ వెంట కర్నూలు డీఎస్పీ రాఘవేంద్ర, సీఐలు, ఎస్సైలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

# అణగారిన వర్గాల హక్కుల సాధనకు ఐక్యంగా ముందుకు సాగాలి

వెల్దుర్తిలో ఎమ్మార్పీఎస్ – ఎంఎస్పి నూతన గ్రామ కమిటీల నిర్మాణం

గ్రామస్థాయి నుంచి ఉద్యమాన్ని బలోపేతం చేయాలని నాయకుల పిలుపు

**వెల్దుర్తి, ఆగస్టు 30, (సీమకిరణం న్యూస్):** పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు వెల్దుర్తి మండలంలోని వివిధ గ్రామాల్లో గత రెండు రోజులుగా ఎమ్మార్పీఎస్ – ఎంఎస్పి నూతన గ్రామ కమిటీల నిర్మాణ కార్యక్రమం కొనసాగింది. గ్రామస్థాయిలో సంఘటిత శక్తిని బలోపేతం చేయడమే లక్ష్యంగా కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం ఎమ్మార్పీఎస్ – ఎంఎస్పి మండల మాజీ నాయకులు ఎన్. గిడ్డయ్య మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించగా, మండల ఇన్‌చార్జి పాముల కుమార్ మాదిగ, కళామండలి నాయకులు విజయ్ మాదిగ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. నూతనంగా ఎంపికైన గ్రామ కమిటీ సభ్యులకు వారు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా




నాయకులు మాట్లాడుతూ అణగారిన వర్గాల హక్కుల సాధన, సామాజిక సమానత్వం, రాజ్యాధికార సాధన లక్ష్యంగా ప్రతి కార్యకర్త ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసి, రాజ్యాంగం కల్పించిన హక్కులను సాధించుకునే దిశగా ముందుకు సాగాలని సూచించారు. యువత, మహిళలు, ప్రతి కుటుంబాన్ని ఉద్యమంలో భాగస్వామ్యం చేస్తూ సామాజిక గౌరవం, సమానత్వం, విద్య, ఉపాధి, రాజకీయ సాధికారత కోసం నిరంతరం కృషి చేయాలని నాయకులు తెలిపారు.

**నూతన కమిటీలు**

వెల్దుర్తి మండలంలోని గోవర్ధనగిరి గ్రామ కమిటీ అధ్యక్షులుగా




మధు శేఖర్, రాజశేఖర్లను ఎంపిక చేశారు. అలాగే బింగిదొడ్డి గ్రామ కమిటీ అధ్యక్షులుగా రెడ్డిపోగు ప్రకాష్, మహేష్ను ఎన్నుకున్నారు. ఆయా గ్రామాలకు చెందిన పలువురు కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. నూతనంగా ఏర్పడిన ఎమ్మార్పీఎస్ – ఎంఎస్పి గ్రామ కమిటీలు ఉద్యమాన్ని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేసి, అణగారిన వర్గాలకు సమానత్వం, ఆత్మగౌరవం, రాజ్యాధికారం సాధించే దిశగా ఐక్యంగా ముందుకు సాగాలని నాయకులు ఆకాంక్షించారు.

# ఇంట్లోకి చొరబడి దోచేశారు.. పోలీసుల నిఘాతో కటకటాలపాలు!

ఇంటి దొంగతనం కేసులో నలుగురు ముద్దాయిల అరెస్టు


సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితుల కదలికలపై నిఘా..

పొలాల్లో దాక్కున్న వారిని పట్టుకున్న పోలీసులు

**కర్నూలు క్రైమ్, ఆగస్టు 30, (సీమకిరణం న్యూస్) :** నాలుగవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఇంటి దొంగతనం కేసును పోలీసులు ఛేదించి నలుగురు ముద్దాయిలను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 2.5 తులాల బంగారు ఆభరణాలు, 32 తులాల వెండి ఆభరణాలతో పాటు దొంగతనానికి ఉపయోగించిన స్కూటీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జూలై 6న కర్నూలు నగరంలోని నాలుగవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదిత్యనగర్––ఉల్చాల రోడ్డులో నివాసం ఉంటున్న జయంతి మహేశ్వర్ రెడ్డి ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్న సుమారు 25 గ్రాముల బంగారు నగలు, 32 తులాల వెండి ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన 4వ పట్టణ సీఐ విక్రమ్ సింహ సీసీ కెమెరా ఫుటేజ్‌లు, ఇతర ఆధారాలను సేకరించి కేసు దర్యాప్తును ఎస్సై చంద్రశేఖర్ రెడ్డికి అప్పగించారు. ఎస్సై చంద్రశేఖర్ రెడ్డి చాకచక్యంగా నిందితుల కదలికలపై నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో సమ్మర్ స్టోరేజ్ సమీపంలోని పొలాల్లో దాక్కొని ఉన్న నిందితులను పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

**అరెస్టయిన నిందితులు**

1. **ఎరుకలి గంగా ప్రసాద్, తండ్రి:** ఎరుకలి రామాంజనేయులు, వయస్సు 38 సంవత్సరాలు, తాడిపత్రి టౌన్.
2. **ఎరుకలి శివప్రసాద్, తండ్రి:** ఎరుకలి రామచంద్ర, వయస్సు 48 సంవత్సరాలు, తాడిపత్రి టౌన్.



3. **కామ్లే కార్తిక్, తండ్రి:** శ్రీనివాసులు, వయస్సు 32 సంవత్సరాలు, ఇందిరాగాంధీ నగర్, కర్నూలు.
4. **ఎరుకలి రామాంజనేయులు, తండ్రి:** ఎరుకలి సుంకన్న, వయస్సు 43 సంవత్సరాలు, పామిడి; ప్రస్తుతం గుత్తి, అనంతపురం జిల్లా.

నిందితుల వద్ద నుంచి రెండు బంగారు చైన్లు, చిన్నపిల్లల ఉంగరాలు కలిపి మొత్తం 2.5 తులాల బంగారు ఆభరణాలు, 32 తులాల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే దొంగతనానికి ఉపయోగించిన స్కూటీ వాహనాన్ని కూడా పోలీసులు సీజ్ చేశారు. అనంతరం నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

# రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



ఎస్సై నాగార్జున

**ప్యాపిలి ఆగస్టు 30 (సీమ కిరణం న్యూస్) :** రౌడీషీటర్లు ఇకపై ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్సై నాగార్జున సూచించారు. ఆదివారం ప్యాపిలి పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై నాగార్జున మాట్లాడుతూ గతంలో జరిగిన తప్పిదాలను పునరావృతం చేయకుండా చట్టబద్ధమైన మార్గంలో జీవించాలని సూచించారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం, బెదిరింపులకు పాల్పడటం, గొడవలకు దిగడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని తెలిపారు. రౌడీషీటర్ల కదలికలపై పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతున్నారని, ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించి సమాజంలో మంచి పౌరులుగా గుర్తింపు పొందాలని కోరారు. యువతను చెడు మార్గంలోకి తీసుకెళ్లకుండా వారికి అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని ఎస్సై నాగార్జున స్పష్టం చేశారు.

# ప్యాపిలి హైవే నిరసనకు సహకరించిన ఎం.విఆర్.పిఎస్ నేతలకు ఘన సన్మానం

**ప్యాపిలి ఆగస్టు 30 (సీమ కిరణం న్యూస్) :** వాల్మీకుల ఎస్టీ హోదా పునరుద్ధరణ కోసం ఈ నెల 14న ప్యాపిలి జాతీయ రహదారిపై నిర్వహించిన నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేసి, సహకరించిన మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజా సమితి ప్యాపిలి మండల నేతలకు నంద్యాల యం విఆర్ పిఎస్



కార్యాలయంలో స్కార్యాలయంలో ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.విఆర్.పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు బోయ పులికొండన్న, ప్రధాన కార్యదర్శి లాలుస్వామి, ఉపాధ్యక్షులు టి.జి. నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి జయరాం తదితరుల ఆధ్వర్యంలో ప్యాపిలి ప్రాంతానికి చెందిన నాయకులను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, జిల్లా అధికార ప్రతినిధి బాల రంగయ్య, యూత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేష్, ప్రతాప్, రంగనాయకులు, లోకేష్, నాగరాజు (కలసట్ల), రామాంజి, పెద్దిరాజు, కేసాలు, నరసింహ తదితరులను సన్మానించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇకనైనా స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్‌పై పాలకుల్లో మార్పు రాకపోతే రానున్న అసెంబ్లీ సమావేశాల్లో అసెంబ్లీ ముట్టడి, వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా అర్ధనగ్న ప్రదర్శన వంటి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో రాజకీయ పార్టీలను నిలదీయడంతో పాటు, అన్ని స్థానాల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. తమ డిమాండ్లపై ఇంకా మొండివైఖరి కొనసాగితే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వాల్మీకుల సత్తా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా, రాష్ట్ర, పట్టణ, యూత్ విభాగాల నాయకులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, యువనేతలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రవర్తనను మార్చకోక పోతే శిక్ష తప్పదు



**డోన్ టౌన్, ఆగస్టు 30,(సీమ కిరణం న్యూస్):** నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షరాన్ డోన్ డిఎస్పి ఆదేశాల మేరకు టౌన్ పోలీస్ స్టేషన్ నందు సి.ఐ ఇంతియాజ్ భాష ఆధ్వర్యంలో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు మరియు సస్పెక్ట్ రౌడీ షీటర్లకు పోలీస్ స్టేషన్ ఆవరణలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ సీ.ఐ మాట్లాడుతూ, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని తెలిపారు. చట్టాన్ని గౌరవిస్తూ బాధ్యతాయుతమైన పౌరులుగా మెలగాలని సూచించారు. నేరాలకు పాల్పడకుండా కుటుంబ సభ్యుల సంక్షేమం కొరకు సమాజంలో గౌరవప్రదమైన జీవితం కోసం సత్ప్రవర్తనతో ఉండాలని హితవు పలికారు. మద్యం సేవించి గొడవలు చేయడం, బెదిరింపులకు పాల్పడడం, జూదం, ఇతర సంఘవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని కోరారు. ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘించి శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడితే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమాజంలో శాంతి, భద్రతలు నెలకొల్పేందుకు పోలీసు శాఖ చేపడుతున్న చర్యలకు ప్రజల సహకారం అవసరమని, మంచి ప్రవర్తనతో జీవనం సాగించే వారికి పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సీ.ఐ తెలిపారు.

# గుండె నొప్పి వస్తే వెంటనే సీహెచ్‌సీకి రావాలి



**వెల్దుర్తి, ఆగస్టు 29, (సీమకిరణం న్యూస్ ):** వెల్దుర్తి మండల ప్రజలు గుండె, ఛాతీలో నొప్పి కనిపించిన వెంటనే ఏమాత్రం ఆలస్యం చేయకుండా మండల కేంద్రంలోని సామాజిక ప్రభుత్వ ఆసుపత్రి (సీహెచ్‌సీ)ని సంప్రదించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బాలచంద్ర రెడ్డి సూచించారు. శనివారం ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల గుండె నొప్పితో చికిత్స పొందిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు బాబ్జీ, చికిత్స అందించిన డాక్టర్ వరప్రసాద్‌తో కలిసి సూపరింటెండెంట్ వివరాలు వెల్లడించారు. ప్రైవేట్ మార్కెట్‌లో దాదాపు రూ.50 వేల వరకు ధర పలికే 'ఎలాక్సిన్' ఇంజెక్షన్ సీహెచ్‌సీలో రోగులకు ఉచితంగా అందుబాటులో ఉందన్నారు. ఇప్పటికే పదుల సంఖ్యలో గుండె సంబంధిత రోగులకు ఈ ఇంజెక్షన్ అందించి చికిత్స అందించినట్లు తెలిపారు. ఆసుపత్రిలో ఈసీజీ సౌకర్యం అందుబాటులో ఉండడంతో గుండె నొప్పితో వచ్చే రోగులకు వెంటనే ఈసీజీ నిర్వహించి, గుండెపోటు నిర్ధారణ కాగానే అవసరమైన ఇంజెక్షన్ అందిస్తున్నామని చెప్పారు. గుండెపోటు వచ్చిన సమయంలో 'గోల్డెన్ అవర్'లో చికిత్స అందించడం అత్యంత కీలకమని డాక్టర్ వరప్రసాద్ తెలిపారు. ఈ సమయంలో ఎలాక్సిన్ ఇంజెక్షన్ ప్రాణదాతగా నిలుస్తోందన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు బాబ్జీ మాట్లాడుతూ తనకు ఇటీవల గుండెలో నొప్పి రావడంతో వెంటనే ఆసుపత్రికి వెళ్లగా ఎలాక్సిన్ ఇంజెక్షన్ అందించడంతో కోలుకున్నట్లు తెలిపారు. సీహెచ్‌సీలో అందుబాటులో ఉన్న వైద్య సౌకర్యాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు కోరారు.

# కేడిసిసి బ్యాంక్ చైర్మన్ డి. విష్ణువర్ధన్ రెడ్డిని కలిసిన సీఐ తబ్రేజ్, ఎస్ఐ రాజా కూల్లాయప్ప



**కర్నూలు, ఆగస్టు 30 (సీమకిరణం న్యూస్):** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ ఎదురూరు విష్ణువర్ధన్ రెడ్డిని కోడుమూరు సీఐ తబ్రేజ్, గూడూరు ఎస్ఐ రాజా కూల్లాయప్ప మర్యాదపూర్వకంగా కలిశారు.

